ప్రజాశక్తి
బుధవారం 25 జనవరి 2023
5
విజయనగరం



నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఆడిటోరియంలో బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ. సూర్యకుమారి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్. రాజు హాజరు కానున్నారని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 1 గంటకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, దీనిలో భాగంగా ముందుగా కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన సందేశాన్ని మైక్ ద్వారా సభికులకు వినిపిస్తామని వివరించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా యువ ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులను అందజేస్తామని తెలిపారు.

అంబరాన్నంటిన 'సంబర'ం

- తరలివచ్చిన భక్తులు
- పోలమాంబను దర్శించుకున్న డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే
- బందోబస్తును పర్యవేక్షించిన ఎస్‌పి, ఎఎస్‌పి

ప్రజాశక్తి-మక్కువ

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి జాతర అంబరాన్ని తాకింది. లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య సిరిమాను సంబరం వైభవంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం స్థానిక చదురుగుడి నుండి అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ సిరిమాను వద్దకు తోడ్కొని వచ్చారు. పూజలు అందుకున్న అనంతరం 3.45గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు మేళ తాళాల నడుమ సిరిమానును అధిరోహించారు. తొలుత గరుడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న సిరిమాను తరువాత సావిడి వీధిలోని మునసబు ఇంటి వద్ద పూజలు అందుకొని ముందుకు సాగింది. పటిష్ట పోలీసు బందోబస్తు, రోప్ పార్టీ నడుమ సినిమాను ఊరేగింపు చేపట్టారు. ప్రధాన రహదారి నుండి ఎస్‌సి కాలనీ, పనుకువీధి, గొల్లవీధి, కాలనీ పనుకు వీధి గొల్ల వీధి కొండవీటి ఎస్సీ హాస్టల్ సమీపం నుండి తిరిగి భక్తులు పూజలు అందుకుని చావిడివీధి వరకు సాగింది. అనంతరం అమ్మవారి ఘటాలను గద్దెవద్ద ఉంచారు. అనుకున్న సమయానికి 45నిముషాలు ఆలస్యంగా ప్రారంభమైన సిరిమాను సంబరం 5.30గంటలకు ముగిసింది. గత రెండేళ్లుగా కరోనా కారణంగా జాతరకు దూరంగా ఉన్న జనం ఈఏడాది సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు.

సిరిమాను సంబరాన్ని పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. డిఎస్‌పిలు సుభాష్, హర్షిత చంద్రకు ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. సిరిమానుకు రోప్ పార్టీ, పోలీస్ సిబ్బందితో రక్షణ వలయంగా ఏర్పడి ప్రశాంతంగా ముగిసేలా చర్యలు తీసుకున్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న సిరిమాను

జాతరను సందర్శించిన విజయనగరం ఎస్‌పి

సంబర పోలమాంబ అమ్మవారి సినిమానోత్సవాన్ని విజయనగరం జిల్లా ఎస్‌పి దీపికా పాటిల్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. జాతర విజయవంతంగా సాగేందుకు తీసుకున్న చర్యలను ఆమెకు అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్‌ను డిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు



మొక్కు చెల్లిస్తున్న భక్తురాలు

అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం

పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం రాజన్న దొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మాజీ ఎంపి బొత్స ఝాన్సీలక్ష్మి, సాలూరు మాజీఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ దర్శించుకున్నారు. దేవాదాయశాఖ అధికారులు డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం పలికారు అనంతరం రాజన్నదొర జాతర ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.



అమ్మవారి దర్శనానికి వస్తున్న రాజన్నదొరకు స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది



ఎఎస్‌పి, డిఎస్‌పిలతో మాట్లాడుతున్న విజయనగరం ఎస్‌పి దీపిక



పోలమాంబ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి, ఎమ్మెల్సీ రఘువర్మ

బాలికలను రక్షిద్దాం..చదివిద్దాం

జాతీయ బాలికల దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరం

బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం అనే నినాదంతో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఎ.సూర్యకుమారి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.అనంతరం ఆమెతో పాటు ఎంఎల్‌సి పి.రఘు వర్మ, బాలల హక్కుల చైర్మన్ కేసలి అప్పా రావు , మేయర్ విజయలక్ష్మి , సిడబ్లుసి చైర్‌పర్సన్ హిమ బిందు తదితరులు మాట్లాడారు. బాలికల పుట్టికను ప్రేమతో స్వాగతించాలని, వారి హక్కుల కు, పురోభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు జీవితం సెటిల్ అవ్వడం అంటే పెళ్లి మాత్రమే నని భావించ కూడదని, మంచి చదువు, మంచి ఆలోచన ఉండాలని అన్నారు. సఖీ సమావేశాల్లో పలు అంశాలు చర్చిస్తున్నారని, అమ్మాయిలకు ఉపయోగ పడే అనేక అంశాలు అవగతం చేసుకోవచ్చునని, ఈ సమావేశాలకు బాలికలు, మహిళలు తప్పక హాజరు కావాలని అన్నారు. బాలికలు రక్త పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించు కోవాలని, ఆరోగ్య సంబంధిత అంశాల పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎమ్మెల్సీ రఘు వర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కతి 2 వేల సంవత్సరాలైనా చెక్కు చెదరకుండా ఉందంటే అది భారతీయ స్త్రీ వల్లనేనని ఇటీవల కేంబ్రిడ్జి యూనివర్సిటీ పరిశోధన లో తెలియజేశారని తెలిపారు., అంతటి ఘనత ఉన్న మన సంస్కృతిని నిలపడంలో స్త్రీ ప్రముఖ పాత్ర వహించడం గొప్ప విషయమని అన్నారు.బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పా రావు మాట్లాడుతూ స్త్రీ ఒకప్పటి కంటే ప్రస్తుతం చైతన్యం చెంది ఉన్నారని, అన్నిరంగాల్లో పురుషులతో పాటు స్త్రీలు అభివద్ధి చెందు తున్నారని తెలిపారు. పలు పరీక్షల్లో టాప్ 10 లో బాలికలే ఎక్కువగా నిలుస్తున్నారని, ప్రభుత్వం కూడా బాలికలకు అనేక అవకాశాలను కల్పిస్తోందని అన్నారు. టీనేజ్ బాలికలు సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని, తమ లక్ష్యాలను సాధించే వరకు కష్టపడి చదువుకోవాలని అన్నారు. బాలా హక్కులకు భంగం కలిగిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఐసిడిఎస్. ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ రమణకుమారి, జిల్లా అధికారలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా నిలిచాయి. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ బుర్రకథ రూపం లో ప్రదర్శిస్తూ చిన్నారులు అభినయించిన తీరు ఆకట్టుకుంది.

గెలుపే లక్ష్యం కావాలి

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, రేగిడి

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం నగరంలోని లీ పేరడైజ్ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విజయనగరం నియోజకవర్గ స్థాయి సమావేశంలోను, రాజాంలోని సూర్య దుర్గ కళ్యాణ మడపంలో జరిగిన ఆ నియోజకవర్గ సమావేశంలోను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేనని అన్నారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందేలా చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో పింఛను మొత్తం రూ.3వేలు అందిస్తామన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా రంజక పాలనపై ప్రతిపక్షాలు దుష్ప్రచారాన్ని చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లను నిరుపేదలకు అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నగరానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 200 కోట్ల రూపాయలు మంజూరు చేసి రామతీర్థ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు టెండర్ల దశకు చేరిందన్నారు. నవరత్నాలు పేరుతో ప్రతి పేదవాడికి, ప్రతి ఇంటికి పథకాలు అందజేశామన్నారు. అన్ని రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం పై ప్రభుత్వం దష్టి సారించిందని అన్నారు.. సచివాలయ వ్యవస్థ తెచ్చి దేశానికి ఆదర్శమన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఎన్నికలలో వైసిపి గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల నాటికి వైసిపి పూర్తిగా పటిష్టం కావాలన్నారు. విజయనగరంలో వైసిపి గెలుపు భవిష్యత్తుని నిర్దేశించేది స్థానిక నాయకులేనని అన్నారు. రా సమావేశాలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు పేరాడ తిలక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహన్ రావు, పలాస అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణ రాజు(పులి రాజు), మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతి దేవి, కెవి సూర్యనారాయణ రాజు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, కోలగట్ల తమన్న శెట్టి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం : సమావేశంలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

మట్టిదోపిడీ

- చెరువుల నుంచి యథేచ్ఛగా తరలింపు
- అభివృద్ధి పనుల పేరుతో గుట్టలను, చెరువులను కొల్లగొడుతున్న వైనం



చెరువులో మట్టి తవ్వుతూ లారీల్లో లోడు చేస్తున్న జెసిబి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జిల్లాలో ఇటీవల మట్టి, ఇసుక, తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్లు, మట్టి వ్యాపారులు అక్రమ దందాలతో ప్రకృతి సంపద అయిన కొండలు, గుట్టలు, ఇసుక రీచ్ లు, చెరువులను కొల్లగొడుతున్నారు. రోడ్లు, భవనాలు, రైల్వే లైన్ లంటూ అభివృద్ధి పనుల పేరుతో ప్రైవేటు, ప్రభుత్వ భూములు, చెరువులు అని తేడా లేకుండా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడున్నారు. యథేచ్ఛగా తరలిస్తూ కాంట్రాక్టులు లక్షల గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. విజయనగరం. పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైల్వే అభివృద్ధి పనులు పేరిట రోడ్డు నిర్మాణం చేపడు తున్నారు. ఇందుకోసం కొన్ని కోట్ల రూపాయల నిధులు మట్టి తరలించేందుకు టెండర్లు చేపట్టారు. ఇందుకోసం కాంట్రాక్టర్లు కొన్నిచోట్ల గనులశాఖ, రెవెన్యూ యంత్రాంగం నుండి కొంతవరకు అనుమతులు తీసుకున్నారు. కానీ వాటికి విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గనుల శాఖకు రిజిస్ట్రేషన్ ఛార్జీలతో పాటు చెస్ ఛార్జీలు చెల్లించడంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా దత్తిరాజేరు మండలంలోని అనేక చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వారం రోజులుగా జాతీయ రహదారికి ఆనుకొని కోమటిపల్లి రెవిన్యూ పరిధిలో రాయలవాని చెరువులో అడ్డు అదుపూ లేకుండా జెసిబితో తవ్వి ట్రిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఇలా అనేక ప్రాంతాలలో మట్టి మాఫియా పెరిగిపోయి సీనరేజి, జిల్లా మినరల్ ఫండ్, మెరిట్ ఫండ్ రూపంలో ఖజానాకు భారీగా గండి కొడుతున్నారు.

అనుమతులు ఇలా ...

నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు మట్టి తవ్వకాలు చేపట్టుకోవడానికి జిల్లాలోని భూగర్భ గనుల శాఖకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొని సంబంధించిన అధికారులు నిర్దేశించిన సీనరేషన్ చెల్లించి అక్కడ నుండి రెవెన్యూ శాఖ ఎన్ఒసి సర్టిఫికెట్ ఇచ్చిన అనంతరం తవ్వ కాలుచేపట్టాల్సి ఉంటుంది. కానీ ఎటువంటి అనుమతులూ లేకుండానే యథేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి.

ఎలాంటి అనుమతులూ లేవు

కోమటిపల్లి రెవెన్యూ పరిధిలో చేపడుతున్న మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. సంబంధిత విఆర్ఒను పంపించి తవ్వకాలు నిలిపివేస్తాం.

డి.రమేష్, తహశీల్దార్, దత్తిరాజేరు

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

- సిడిపిఒకు అంగన్‌వాడీ వర్కర్ల వినతి
- ప్రభుత్వం స్పందించకుంటే 6న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్యకర్తలు ధర్నా చేశారు. సిడిపిఒ జి.ప్రసన్నకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ వేతనాలు చెల్లించకుండా పండగ పూట అంగన్వాడీ కార్యకర్తలను పస్తులు ఉంచడం దుర్మార్గమన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి కార్మికులుగా గుర్తించమంటే అమల్లో ఉన్న సంక్షేమ పథకాలకు కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీసం తో కూడిన రిటర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, ఫేషియల్ ఆప్ రద్దు చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేసేందుకు కందిపప్పు, ఆయిల్ క్వాంటిటీ పెంచాలని, అంగన్వాడీలకు జాబ్ కేలండర్ నిర్ణయించాలని, సర్వీస్ లో ఉంటూ మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, భీమా అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించుకుంటే ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ఆందోళన ధర్నా చేస్తామని తెలిపారు. ధర్నాలో ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షులు విశాలాక్షి, కార్యదర్శి శివలక్ష్మి, సెక్టార్ లీడర్లు ప్రసన్న, లలిత, రవణమ్మ రాజేశ్వరి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

26 నుంచి ప్లెక్సీల నిషేధం

నగరంలో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం అమల్లోకి వస్తుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. ప్రంతీ ఒక్కరూ ప్లాస్టిక్ నిషేణవన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధంపై నిర్వహించిన అవగాహనా ర్యాలీని స్థానిక ఎత్తుబ్రిడ్జివద్ద మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కాలుష్య నియంత్రణా మండలి, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాముల నాయుడు మాట్లాడుతూ, ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీల నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలను తీసుకుంటామన్నారు. పబ్లిషర్లు, ప్రింటర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, అవసరమైన వారికి ప్రభుత్వపరంగా సబ్సిడీ, బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. నిషేధాన్ని పక్కాగా అమలు చేయడానికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ర్యాలీలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సుదర్శన్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్,మున్సిపల్ కమిషనర్ తదితరులు

సెమీఫైనల్‌కు చేరిన విజయనగరం బాలికల జట్టు

రసవత్తరంగా సాగుతున్న అండర్ 17 కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్ 17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజయనగరం బాలికల జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. మంగళవారం సాయంత్రం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మొదటి రౌండ్ లో బాలుర విభాగంలో చిత్తూరు- విశాఖపట్నం జట్లు మధ్య జరిగిన మ్యాచ్ లో విశాఖ, శ్రీకాకుళం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో శ్రీకాకుళం జట్టు విజయం సాధించాయి. బాలికల విభాగంలో కృష్ణా, విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో విజయనగరం జట్టు విజయం సాధించింది. నెల్లూరు- శ్రీకాకుళం జట్లు మధ్య జరిగిన మ్యాచ్ లో శ్రీకాకుళం బాలికల జట్టు విజయం సాధించింది. బుధవారం ఉదయం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ లు జరగనున్నాయి. విజేతలకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులు మీదుగా బహుమతులు అందజేస్తారు.



తలపడుతున్న విజయనగరం, కృష్ణా బాలికల జట్లు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

డిటిసి డాక్టర్ వి.సుందర్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రతీఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వి.సుందర్ కోరారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా బాలాజీ జంక్షన్ నుంచి, కెఎల్‌పురం ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం వరకు మంగళవారం మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం, డిటిసి సుందర్ మాట్లాడుతూ, రహదారి భద్రతా ప్రమాణాలపట్ల వాహనదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలు, సీట్ బెల్టు పెట్టుకోవడం, హెల్మెట్ ధారణ, ఇతర భద్రతా చర్యలు, లైసెన్సులు పొందే విధానం తదితర అంశాలను వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎవి రమణ, ఎన్.రమేష్, యు.దుర్గాప్రసాద్, రవిశంకర్ ప్రసాద్, శ్రావ్య, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిటిసి వి.సుందర్

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

శృంగవరపుకోట: 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విద్యార్థిని విద్యార్థులకు ఓటు హక్కు పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం శతాధిక వయోవృద్ధ ఓటర్‌లకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

కాంపొనెంట్ నిధులకు చట్టబద్ధతపై హర్షం

విజయనగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి,ఎస్టి కాంపోనెంట్ నిధుల వినియోగానికి చట్టబద్ధత పదేళ్ల పాటు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం హర్షణీయమని మాజీ ఎమ్‌పి డివిజి శంకర్రావు పేర్కొన్నారు. ఉపప్రణాళికా నిధులకు 2013 లో కల్పించిన చట్టబద్ధత ముగిసినందున అత్యవసర ప్రాతిపదికన ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా చట్టం నిర్వీర్యం కాకుండా జాగ్రత్త పడినట్లయ్యిందని తెలిపారు. శాసన సభ సమావేశాల్లో అందుకు తగిన చట్టాన్ని ప్రవేశపెట్టి ఆమోదం పొందేవరకూ ఈ ఆర్డినెన్స్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రణాళిక,ఉపప్రణాళిక తరహా విభజనలకు మంగళం పాడినప్పటి నుండి కాంపోనెంట్ నిధులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఏ పేరుతో వ్యవహరించినా బలహీన వర్గాలకు జనాభా దామాషా పద్ధతిలో కేటాయింపులు ఉండాలని, విడుదలైన నిధుల్ని దారి మళ్లించకుండా, మురిగిపోయి వెనక్కి పోయేలా కాకుండా ఈ చట్టబద్ధత కాపాడుతుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు

వేపాడ : వేపాడలో గౌరమ్మ చావిడి వీధితో పాటు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జిజిఎం నిధుల నుండి రూ. 2లక్షలు మంజూరయ్యాయని ఆ నిధులతో పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి. దేవి అన్నారు. ఆ గ్రామంలో నాయకులు మెలిపాక రమణ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

గృహ సారధులతో సమన్వయం

బొబ్బిలి : గృహ సారాధులను సమన్వయం చేసుకుని సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు కలిసి పని చేయాలని బొబ్బిలి పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి విస్సు కోరారు. పట్టణంలో కంచరవీధి, అగురువీధి సచివాలయాల్లో మంగళవారం సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన కోసమే సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం నూతనంగా నియమించిన గృహ సారాధులను సమన్వయం చేసుకుని సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.రమణమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పారా లీగల్ వాలంటీర్ల భర్తీకి దరఖాస్తులు

బొబ్బిలి : బొబ్బిలి కోర్టు పరిధిలో పారా లీగల్ వాలంటీర్లుగా పని చేసేందుకు అభ్యర్థులు కావాలని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాలంటీర్లకు ఎటువంటి వేతనం, పారితోషికం ఇవ్వమన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విజయనగరం టౌన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి సందర్భంగా కోరుకొండ సైనిక్ స్కూల్లో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో స్థానిక ది సన్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.వ్యాసరచన పోటీలలో 9వ తరగతి చదువుతున్న నందిని, చిత్రలేఖన పోటీలో 7వ తరగతి చదువుతున్న ఎల్. సింధు తరంగిణి ప్రథమ స్థానాలలో బహుమతులను గెలుచుకున్నారు.వ్యాసరచన పోటీలలో 8వ తరగతి విద్యార్థి గగనచరణ్, రవిత ద్వితీయ, తృతీయ స్థానాలలో బహుమతులను గెలుచుకున్నారు. చిత్రలేఖన పోటీలో 6వ తరగతి చదువుతున్న లలితశ్రీ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోడీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ అనే కార్యక్రమంలో భాగంగా కె.వి.యస్ వారి ఆధ్వర్యంలో జరిగిన చిత్రలేఖన పోటీలో 9వ తరగతికి చెందిన విశాల్ రెడ్డి నాల్గవ స్థానంలో బహుమతి పొందారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ రవీంద్ర విద్యార్థులు, కనబరిచిన ప్రతిభను, ఉపాధ్యాయులను అభినందించారు.

ప్రభుత్వ సేవల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

విజయనగరం : ఏపి సేవా పోర్టల్ ద్వారా ప్రజలకు సేవలు మరింత మెరుగ్గా అందించడానికి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను సందర్శించిన కలెక్టర్ అక్కడి సిబ్బందికి పలు సూచనలను జారీ చేశారు. టిడ్కో, ఐసిడిఎస్, పౌర సరఫరాలు, నాడు నేడు, సర్వ శిక్షా అభియాన్, విద్యా, మధ్యాహ్న భోజనం, ఆరోగ్య శ్రీ , హౌసింగ్ తదితర శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, పనుల పురోగతిపై రోజు వారీ నివేదికలను కలెక్టర్‌కు ప్రతి రోజు అందించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల నుండి అనేక యాప్‌ల ద్వారా అందిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలను తయారు చేస్తున్నామని.

విజేతలకు బహుమతులు అందజేత

వేపాడ : మండలంలోని వల్లంపూడిలో మంగళవారం సాంబమూర్తి తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 56 మంది పాల్గొని తలబడ్డారు. విజేతలకు గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఉదయం వైభవంగా ప్రారంభమైన ఈ తీర్థ మహోత్సవంలో కాంగో డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా హోర్డింగ్‌లు

బొబ్బిలి : రోటరీ క్లబ్ ఆఫ్ బొబ్బిలి టైగర్స్, కరుణ్య ఫౌండేషన్ సౌజన్యంతో బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఆర్. శ్రీరామ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్ ఎదురుగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేక, అవగాహనకు సంబంధించిన హోర్డింగులు ఏర్పాటు చేశారు. ఇలాంటి దురలవాట్లు గురించి అవగాహన కల్పించేందుకు సిఐ సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి భారీ హోర్డింగులను ఏర్పాటు చేసినందుకు సిఐ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, కార్యదర్శి శ్రీహరి, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు శంకర్రావులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

శృంగవరపుకోట : ప్రజలందరూ రహదారి భద్రత నియమాలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎస్‌కోట సిఐ యస్. సింహాద్రి నాయుడు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిఐ తాను స్వయంగా తయారు చేసిన క్విజ్ ప్రశ్నలను విద్యార్థులకు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులకు తెలియజేసి టు వీలర్ మీద ప్రయాణం చేసినప్పుడు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని కోరారు. అనంతరం సి.ఐ సింహాద్రి నాయుడుని, ఎస్ఐ లోవరాజుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ, ప్రధానోపాధ్యాయులు బి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో ముగిసిన శిక్షణా తరగతులు

డెంకాడ : చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా 'లాబ్వ్యూ రియల్ టైమ్ అప్లికేషన్స్' అనే అంశం పై నిర్వహించిన శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు సభలో ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ కెవిఎల్ రాజు మాట్లాడుతూ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం అందరూ కృషి చేశారన్నారు. సహకరించిన రిసోర్స్ పర్సన్స్, పాల్గొన్న సభ్యులకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ డిపార్ట్‌మెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ జి. శ్రీనివాస్, కెయస్. రవికుమార్, డాక్టర్ సునీల్ ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వానరం హల్ చల్..

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో గత మూడు రోజులుగా వానరం హల్ చల్ చేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలు వీధుల్లో హల్‌చల్ చేస్తూ డాబాలపై గెంతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. వీధిలో వెల్లిన వారితో గాండ్రింపు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానరం ఇబ్బందులు పెట్టడంతో అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

వింటున్నారు... వెళ్తున్నారు...

సర్వసభ్య సమావేశంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశాలు నిర్వహించినప్పుడు సభ్యుల సమస్యలు అధికారులు వినడమే తప్ప పరిష్కరించడంలో తగు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు అధికారులపై మండిపడ్డారు. స్థానిక ఎంపిడిఒ కె.రూపేష్ ఆధ్వర్యంలో ఎంపిఇప గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలిత విద్యుత్ శాఖ పనితీరు పట్ల సభ్యులు మండిపడ్డారు. గత సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను నేటికీ పరిష్కరించకపోవడంతో సభ్యులు అసహనానికి గురయ్యారు. బిసి కాలనీలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌కు చెందిన మెట్లు శిథిలావస్థకు చేరడంతో కొన్ని నెలలుగా ట్యాంక్ శుభ్రపరచలేదంటూ గత సమావేశంలో మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే నీటిని తాగడం వల్ల కాలనీ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినప్పటికీ ఆ సమస్య నేటి వరకు పరిష్కరించకపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చంద్రకళను సభ్యులు నిలదీశారు. దింతో పాటు కొట్యాడ గ్రామ పంచాయతీలో ఉన్న జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో ప్రధాన రహదారి గుండా మురుగు నీరు ప్రవహిస్తుందంటూ గత రెండు సమావేశాల్లో తెలిపినా ఇప్పటికీ అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ కొట్యాడ దేవి తెలిపారు. మూడు, నాలుగు తరగతులను ఉన్నత పాఠశాలకు వీలీనం చేయడంతో నాడు - నేడు పథకం ద్వారా మంజూరైన పాఠశాల ఫర్నిచర్ సామాగ్రి వృధాగా పడి ఉన్నాయని చందలూరు ఎంపిటిసి యడ్ల కిషోర్ కుమార్ తెలిపారు. సంతపేట - ముసురాం ప్రధాన రహదారిలో పూర్వ కాలంలో నిర్మించిన కల్వర్టుల కారణంగా వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఆగడాలకు అంతులేకుండా పోతుందంటూ మల్లివీడు పంచాయతీ సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, రేగ ఎంపిటిసి గణపతి ఆరోపించారు. శ్రీరాంపురం సమీపంలో ఉన్న మహామాయ స్టీల్ ఎక్స్రైజ్ పరిశ్రమ ద్వారా రాత్రి సమయంలో గ్రామాల్లోకి కాలుష్యాన్ని వదులుతున్నారని తామరాపల్లి పంచాయతీ సర్పంచ్ ఎం. భాస్కరరావు సమస్యను లేవదీశారు. స్వర్ణ, 1121 వంటి రకాల ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయలేదని ఈ కారణంగా రేగ గ్రామపంచాయతీలో 30 టన్నుల ధాన్యం ఉండిపోయాయని ఎంపిటిసి గణపతి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల చెప్పిన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ తామరపల్లి రామకృష్ణ, వైస్ ఎంపిపిలు ఆవాల శ్యామల, దండేకర్ కుమారి, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు..

బాలికల ఎదుగుదలే నిజమైన సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

బాలికల ఎదుగుదలే సమాజపు నిజమైన అభివృద్ధి అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపర్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం 'జాతీయ బాలికా దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరూ ఆడపిల్లల రక్షణకు, వికాసానికి ఇతోధికంగా కృషి చేయాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ కేరళ వంటి రాష్ట్రాలు మినహా ప్రస్తుతం బాలుర కంటే బాలికల నిష్పత్తి తక్కువగా ఉంటోందని, బాలికల శాతం తక్కువ ఉండకూడదని అన్నారు. బాలికల సంరక్షణే కుటుంబ శ్రేయస్సు అని, స్త్రీ పురుష సమానత్వం ఉండాలని ఆకాంక్షించారు. ఉమెన్ ఎంపర్ మెంట్ సెల్ కో -ఆర్డినేటర్ రేచర్ల శ్రీలక్ష్మీ మాట్లాడుతూ బాలికా వికాసం, ప్రగతి అనేవి ప్రతి మనిషి వివక్ష లేని ఆలోచన దృక్పథంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ సి.వియస్. రవీంద్రనాథ్, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ వాసుదేవ, ఉమెన్ ఎంపర్మెంట్ కన్వీనర్ సంధ్యా రాణి, ఎన్ఎస్ఎస్ పి.ఒ షేక్ వలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న వైద్యులు గోపాలకృష్ణ

వేపాడ: గురుకులంలో మంగళవారం బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఉషారాణి మాట్లాడుతూ బాలికలు విద్య, క్రీడల్లో రాణించాలన్నారు. బాలికలు బాలురుతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. అనంతరం బక్కునాయుడుపేటలో బాలికలతో కలిసి ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తవలస: జనవిజ్ఞాన వేదిక, వియ్యంపేట, పిహెచ్‌సి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం సంయుక్తంగా వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం బాలికలకు అవగాహన విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, గౌరవం, బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, సామాజిక ఎదుగుదల పై పి.హెచ్. ఎన్. జగదాంబ అవగాహనా కల్పించారు. ప్రిన్సిపాల్ టి. జయశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం బాలికలకి దిశా చట్టం, మంచి పౌష్టికహారం, వైద్యం వంటి సదుపాయాలు కల్పించిదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కారక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు ఎమ్.పి.హెచ్.ఈ.ఓ. తిరుపతి రావు, హెచ్. ఎస్. రాము, స్టాఫ్ నర్స్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువుకు హద్దులు ఏర్పాటు

వేపాడ : మండలంలోని నల్లబెల్లి రెవెన్యూ పరిధిలో కనుమలు చెరువుకు మంగళవారం అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. చెరువు కబ్జా నేపథ్యంలో 'అధికారులు అండగా కబ్జాలు' అనే కథనం సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో వెలువడింది. దీనికి స్పందించిన తహశీల్దార్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో చెరువును పరిశీలించి హద్దులు ఏర్పాటు చేశారు.

ఆక్రమణలు తొలగించండి

శృంగవరపుకోట : పట్టణంలోని దేవి కూడలి వద్ద గల క్వాలిటీ ఇన్ హోటల్ వెనుక ఉన్న సిసి రోడ్డు మీద ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా ప్రైవేట్ వ్యక్తులు బడ్డీలను తెచ్చి రోడ్డుమీద పెట్టారని దీంతో రోడ్డు ఇరుకై వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతోందన్నారు.

ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - వంగర, రేగిడి

అంగన్వాడీలకు ఫేషియల్ యాప్‌ను తక్షణమే రద్దు చేసి, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం రాజాం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవన్నారు. కొన్ని కేంద్రాలలో అసలు విద్యుత్ సౌకర్యం కూడా లేదని విద్యుత్ సౌకర్యం ఉన్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించటంలేదని మండిపడ్డారు. రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పనిభారం పెంచారు కానీ వేతనాలు పెంచలేదన్నారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచెయ్యడం లేదని, గ్రామాల్లో నెట్ సౌకర్యం ఉండటం లేదని చెప్పారు. ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి తేవడం సరికాదన్నారు. అంగన్వాడీ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించడం పద్ధతి కాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఐసిడిఎస్ పిఒకు యూనియన్ నాయకులు బి. ఉమకుమారి, పార్వతి, లక్ష్మి, గోవింద్ మ్మ, రమా, వనజాక్షి, అందించారు.



వంగర: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొత్తవలస: అంగన్వాడీ కార్యకర్తలకు రూ. 28వేలు జీతం ఇవ్వాలని సిఐటియు నాయకులు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో

'చరిత్ర సృష్టించనున్న వారాహి యాత్ర '

విజయనగరం టౌన్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపడుతున్న వారాహి యాత్ర చరిత్రలో నిలిచిపోతుందని జనసేన నాయకుడు గురాన అయ్యలు అన్నారు. పవన్ కళ్యాణ్ చేపట్టనున్న వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ.. మంగళవారం ఉదయం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి కోవెలలో గురాన అయ్యలు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రను ఆపేందుకే వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ 1ను తీసుకు వచ్చిందని ఆరోపించారు. పవన్ వారాహి వాహనాన్ని అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ప్రజలే పవన్ కళ్యాణ్‌ను ముందుకు నడిపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి కాటం అశ్విని, జన సేన నాయకులు రవీంద్ర, కళ్యాణ్, హుస్సేన్ ఖాన్, లక్ష్మణ్, సురేష్, రామకృష్ణ, కులదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మాభిమానం కోసమే బొబ్బిలి యుద్ధం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆత్మాభిమానం కోసమే బొబ్బిలి యుద్ధం జరిగిందని యువరాజ బేబినాయన అన్నారు. బొబ్బిలి యుద్ధం జరిగి 266 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం యుద్ధ స్తంభం వద్ద యుద్ధ వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం తాండ్రపాపరాయ విగ్రహానికి, రాజా బహుదూర్ గోపాలకృష్ణ రంగారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆత్మాభిమానం, బొబ్బిలి భూభాగాన్ని రక్షించుకునేందుకు 1757 జనవరి 24న బొబ్బిలి యుద్ధం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఆత్మాభిమానంతో ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాజుల అభిమానులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిషేధంతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి- గరివిడి

మాదకద్రవ్యాల నిషేధంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఇబి అడిషనల్ ఎస్‌పి అస్మా ఫర్హీన్ అన్నారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత గంజాయి, కొకైన్, హెరాయిన్, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలుకు అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి మత్తు పదార్థాలు, మాధక ద్రవ్యాలు సేవించిన వారి పైన, విక్రయించే వారిపైన, కఠిన చర్యలు చేపట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ఇప్పటికే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వేటలో పడి అసాంఘిక కార్యక్రమాలకు లోనై జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారని తెలుపుతూ 'డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు' అనే నినాదాన్ని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులకు వీడియోస్, లఘు చిత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి. ఉమామహేశ్వరరావు, సిఐ సంజీవిరావు, డాక్టర్ దీప్తి, డాక్టర్ మధు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

సోంపురంలో గడపగడపకు..

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఏ సత్యనా రాయణ, టివి రమణ, వైసిపి నాయకులు ద్వారపూడి గంగు నాయుడు, బీల సతీష్, మండల పార్టీ అధ్యక్షులు జగ్గు బాబు, పంచాయతి కార్యదర్శి బి. నాగమణి, పాల్గొన్నారు.

బొబ్బిలి: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పురపాలక సంఘం 8వ సచివాలయం 14వ వార్డులో మంగళవారం రెండవరోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ గడప గడపకు వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్లు గొలగాన రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, వార్డు కౌన్సిలర్ సిరా శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మించిన నూతన భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన కాపుగంటి ప్రకాష్, శ్రీనివాస్, మిగతా సభ్యులతో రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ వ్యాపారస్తులందరూ వ్యాపారాలకే పరిమితం కాకుండా సమాజ సేవలో కూడా పాలుపంచుకోవాలని తెలిపారు. వ్యక్తులు చేయలేని పనులను సంస్థలు పరంగా చేయగలరన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో స్పీడ్ ఆక్సిజన్ మిషన్స్ అందించడంలో ప్రధాన భూమిక పోషించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు అభినందనలు తెలిపారు. భాస్కరరావు మాట్లాడుతూ వ్యాపారవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎప్పుడూ ఉంటుందని అన్నారు. అయితే చిన్న వ్యాపారులు సైతం కోట్లలో పన్ను కట్టాలని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో వ్యాట్‌ను ఎక్కువగా వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముచ్చు రామలింగ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారి రంగనాథన్ రెడ్డి, కాపుగంటి శ్రీనివాస్, పైడా కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడులో ఈ నెల 30,31 తేదీలలో జరుగునున్న పరదేశిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 30 టీమ్‌లు పాల్గొని తలబడతాయని చెప్పారు. గెలిపొందిన మొదటి విజేతకు రూ. 10వేలు, రెండో బహుమతిగా రూ.6వేలు, మూడో బహుమతిగా రూ.4వేలు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వల్లంపూడి ఎస్ఐ రాజేష్, వైసిపి నాయకులు బీల సతీష్, బొడ్డు శ్రీను, బోజంకి శ్రీను, వెన్నెల ఈశ్వరరావు, బీల దేవుడు నాయుడు, బాదిరెడ్డి నరేష్ కుమార్, బూడి శ్రీను, జి దుర్గాప్రసాద్, బూడి రామకృష్ణ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపిపి

యువగళం విజయవంతానికి పూజలు

నెల్లిమర్ల: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని టిడిపి జిల్లా మహిళ అధ్యక్షులు, నెల్లిమర్ల మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి లోకేష్ తలపెట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, జిల్లా మహిళ అధికార ప్రతినిధి కింతడ కళావతి, నియోజకవర్గ మహిళ అధ్యక్షులు చిల్ల పద్మ, ప్రధాన కార్యదర్శి కోట్ల సునీత, స్టేట్ క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి సుహాసిని, రామతీర్థం మాజీ సర్పంచ్ తాడ్డి రమ్య మందాకిని, ముడుమంచి లక్ష్మీ, నరవ రామలక్ష్మి, కాళ్ల సత్యవతి, పొడుగు కృష్ణవేణి, సవరవిల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

షాపులోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి రాయగడ వెళ్తున్న లారీ కోర్టు జంక్షన్‌లో పెట్రోల్ బంకు పక్కనున్న ఫ్రూట్ జ్యూస్ షాపులోకి దూసుకెళ్లింది. పెట్రోల్ బంకు పక్కనున్న ఫ్రూట్ జ్యూస్ షాపు రాత్రి 10 గంటల సమయంలో యజమాని కట్టివేసి ఇంటికి వెళ్ళిపోయాడు. షాపు కట్టి వేసిన తర్వాత విజయనగరం నుంచి రాయగడ రైల్వే స్లీపర్స్ తరలిస్తున్న లారీ అదుపు తప్పి షాపులోకి దూసుకెళ్లింది. షాపు కట్టి ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. షాపు దగ్గరలో ఒక వ్యక్తి స్కూటర్ పై కూర్చుని ఉన్నాడు. లారీ మీదకు రావడాన్ని గమనించిన స్కూటరిస్టు స్కూటర్ విడిచిపెట్టి పారిపోయాడు. స్కూటర్‌ను లారీ ఈడ్చుకుంటూ వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో ఇద్దరు ప్రాణపాయ స్థితి నుంచి తప్పించుకున్నారు. షాపులోకి లారీ దూసుకెళ్లడంతో అక్కడ ఉన్నవారంతా భయభ్రాంతులకు గురయ్యారు. లారీ డ్రైవర్ ఫూటుగా మద్యం సేవించి లారీ నడపడం వల్లనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెపుతున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు

28న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 28 ఉదయం 10 గంటలకు ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపిటిసిలు, మండల స్థాయి నాయకులు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు. వివిధ శాఖ అధికారులు పూర్తి సమాచారంతో మండల సమావేశానికి హాజరు కావాలన్నారు. హాజరు కాని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత మండల సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కారానికి సంబంధించి పూర్తి సమాచారంతో రావాలన్నారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సిద్ధం కావాలన్నారు.

ఉపకరణాలు పంపిణీ

వేపాడ : మండలంలోని వల్లంపూడి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో వికలాంగులకు ఎంపిపి దొగ్గ సత్యవంతుడు చేతులు మీదుగా ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వర్‌రావు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంఇఒ జి శ్రీదేవి, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యానారాయణ, వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్ రావు, సహిత ఉపాధ్యాయులు ఎన్. సత్యవతి, సిహెచ్. జయంతి, ఎల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

26 న ట్రాక్టర్ ర్యాలీ

లక్కవరపుకోట : రైతు సంఘాల ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాలలో ఈ నెల 26న తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను మంగళవారం మండల కేంద్రంలో గల హనుమాన్ జంక్షన్ వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల శాఖ అధ్యక్షులు తరిని వెంకటరమణ, సంఘం చిన్నారావు పాల్గొన్నారు.